# పుచ్చుకొంటినమ్మ వాయినం - ఇస్తినమ్మ వాయినం

కె.యస్.రామచంద్రమూర్తి




క్రైన్ కథోత్సవం - 2006
కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

వెంకన్న పంతులు దస్తావేజుల కట్టకి దండం పెట్టి ముమ్మారు చెంపలేసుకున్నాడు. భక్తిగా కళ్ళు మూసుకొని తెరిచే సరికి రెండు చింతలవాళ్ళ అబ్బాయి, కల్లూరి సూరమ్మ గారి మనవడు రామలక్ష్మణులులా కనిపించారు. "శుభదినం ఈ రోజు. ముచ్చటగా ఉన్నారు గుంటవెధవలు ఇద్దరూ" అని మనస్సులో అనుకొని "ఏం బాబూ కాయితాలు తెచ్చావా?" అన్నాడు. రెండుచింతలవాడు కాయితాలు చేతికి అందించాడు. కళ్లజోడు ముక్కుపైకి లాక్కుని ఆకాయితాలు వరస పెట్టుకుంటున్నాడు వెంకన్నపంతులు. "దండాలు బాబయా!" అన్నాడు గొల్ల వెంకడు. ఊఁ! ఏమిటన్నట్టు చూసాడు పంతులు.

"కోరుటు కాయితం కావాలంటండీ. ఆ బాబు డబ్బులిత్తానన్నాడు అద్దెచ్చుకుంటె. బేగి ఇయ్యండి బాబయా! పెదఏమలి ఎల్లాల ఎండెక్కిపోతున్నాది పాపం గొఱ్ఱెలు కడగట్టీసున్నయి రెండ్రోల బట్టి" వాడి కళ్ళలో నీళ్ళే తరువాయి. వాడికి గొఱ్ఱెలు ప్రాణం. గొఱ్ఱెలకి వాడు ప్రాణం అనిపించింది నాకు. "అయితే వేళాపాళా లేదా ? తెల్లారిందా నీ గోలకి? ఉండు ఈ బాబుల్ని పంపించనీ. అయినా కాయితం ఇమ్మంటన్నారు ఇచ్చీండంటే ఇచ్చేయడానికి నేనెందుకిక్కడా ఏ వెధవున్నా చాలు. ఆఫీసుకొచ్చాను గోల మొదలు. లక్ష్మీ ప్రసన్నం కానిదే ఏ పని నేను చేయనసలు. నన్ను పట్టుకొని ఇచ్చీ ఇచ్చీ అంటే ఒళ్లు మండుతుంది జాగ్రత్త. ఆగ్గాసేపు." కసురుకున్నాడు పంతులు.

"అంబటేల అయిపోతున్నాదిబాబయా! అలగంటరేటి? రొండ్రోలై నాది. గొర్లకి తిండి తిప్పలు నేవు. ఆటి ఉసురు కొడుద్దానాయాలకి. నోరులేని పశువుల్ని కోరుటు కీడిసినాడు. ఆ కాయితం ఇచ్చీసినారంటే ఆ బాబు 56 రూపాయిలు ఇప్పిత్తానని బేగొట్టుకురా అన్నాడు. ఇక్కడున్నట్టు పాఁత్రమ్మన్నాడసలకి. అదేదో తమరు దయసేసి ఇచ్చీ నారంటే నాను నాగొర్లు తీసుకొనిపోవాల. ఇంటికాడ ఆటి మేపు

సూసుకోవాల. రెండ్రోలనుండి ఆటికి పస్తే గదా! నోరు లేని జీవాలు అవేం సేసినాయో ఆ ముద నట్ట పెదవకి." వాడు ఆగేటట్టు లేడు.

"మీరూ మీరూ తన్నుకొని కోర్టు కొస్తే మరేంటవుతుందనుకున్నావురా? వెనకటికొకడు పొలం పోతే పోయింది గాని కోర్టు వ్యవహారాలు తెలిసాయన్నాడట." భళ్లున నవ్వి కుర్రాళ్లవైపు చూసాడు వెంకన్న పంతులు. వాళ్లు గొల్లాడినే చూస్తున్నారు. "అయినా బెంచి కోర్టు మెజిస్ట్రేటు మంచాయిన కాబట్టి వెంటనే తేల్చేసాడు. నీ అదృష్టం బాగుండి డబ్బు లొస్తున్నాయి. అత్రం ఏమిటిరా ? ఆయన మంచివాడు. మీరు అతి మంచివాళ్లు. మధ్యన మేం గుమస్తాలం గాడిద చాకిరి చేసి మట్టికొట్టుకొని పోవాలి. నోరు తెరిచి అడిగితే కాని మీరేం విదల్చరు. సరేలే ! అసలే నువ్వు వెర్రిగొల్లాడివి.ఆనవాయితీ చెబుతున్నాను. 15 రూపాయిలు కట్టి కాయితం తీసుకుపో. తొందరగా ! నా పని చెడగొట్టకు." పంతులు మళ్లీ కాయితాలు సర్దడం ప్రారంభించాడు.

"అదేటి బాబూ ! ఆ టెజరాయిన కాయితం తెస్తే చాలు డబ్బులిత్తనంటే మీరేదో కొర్రెడతన్నారు. నాకాడ పదేను రూపాయలు నేవుకాని ఆనవాయితీ అంటున్నారు గండా ఆర్రూపాయలు తీసుకోండి." అంటూ రొండి నున్న సంచి తీసి చిల్లరడబ్బులు లెక్కెట్టడం ప్రారంభించాడు గొల్లవెంకడు.

"వెధవా! నీకసలు కాయితం ఇస్తానని అనటం పొరపాట్రా! నాకేం దానవిస్తున్నావురా! ఆర్రూపాయిలిస్తాట్ట! బోడి ఆర్రూపాయిలు ! ఫో అవతలకసలు ! బోణీ కాకుండా గోల తగిలింది. వెళ్లు వెళ్లు" కళ్లెర్రజేసాడు పంతులు.

"బాబయా ! అలగగ్గయిపోతెలగండి? నాకాన్నేవు. సత్తిపెమానకంగా నేవు. మీకు నమ్మకం నేకపోతే రొండిని చిక్కాం తమరి సేతిలో ఎడతాను నెక్కెట్టండి. ఎనిమిది రూపాయిల కొక్కానీ ఎక్కువుంటే సెప్పెట్టుక్కొట్టండి. ఆర్రూ పాయిలు తమరు తీసుకుని రెండ్రూపాయిలు నా మొఖానొడీయండి పెద ఏమిలి పోవాలి బాబయా! దారిబత్తెం రెండేనా నేకపోతే ఎట్టా? తమరికి తెల్దేటి?"

"అంటే నేనేదో నీ కడుపుకొట్టి తీసుకుంటున్నానా? అసలు నీతో ఇంతసేపు మాట్లాడడం నాది తప్పు. డబ్బులుంటే అక్కడ పెట్టు. లేదా పోయి తెచ్చుకో. అంతేగాని వెధవ్వేషాలెయ్యకు. నన్ను మాట్టాడించకు నేనసలే మంచివాణ్ణి కాను". పంతులు ఇటు తిరిగి పోయాడు.

గొల్ల వెంకడు "బాబయా! ఆర్రూపాయిలు కంటే నానిచ్చుకోనేను. కాకుంటే యాబయి ఆర్రూపాయిల్లో ఆర్రూపాయిలు తమరు తీసుకొని యాబయి నాకిప్పంచండి. ఆపైన తమ దయ నాకాడ చిల్లికాని నేదు. యాబయి రూపాయిలు కూడా నేకపోతే నా కోరుటు కర్సులకి సేసిన అప్పు తీరడానికి నా తిప్పలు పగోడి క్కూడొద్దు. కనిక రించండి" పంతులు కాళ్ళు పట్టుకోబోయాడు వాడు.

పంతులు చీదరించుకుని బుస కొట్టాడు "అంటే నేను కసాయి వెధవ నన్నమాట నా మాట నేను చెప్పాను నీ చావు నువు చావు నన్ను విసిగించక" అని కుర్రాళ్ళ కేసి తిరిగి "ఉండుబాబూ ! వీడోపీడలా పట్టుకున్నాడు అయిదు నిముషాల్లో మీపని చూసి పంపించేస్తాను. ఆ ఇదుగో ఈ కాయితంమీద రిజిష్ట్రార్ గారి దగ్గర నాన్నగారు సంతకం పెట్టాలి. తవర్ని ఒకసారి పంతులు రమ్మన్నారని చెప్పు. ఒక్క నిముషం ఉండు కాయితమ్మీద రాసిస్తాను." అని ఆ పనిలో మునిగి పోయాడు పంతులు. గొల్లవెంకడు విచారంగా కూర్చున్నాడు.

పిల్లలిద్దరు వాళ్ళల్లో వాళ్ళు మూగ సంజ్ఞలు చేసుకున్నారు. అదేదో నాక్కొంచెం అర్ధమయినట్టు అనిపించింది. "పంతులుగారూ! మేమిద్దరం ఇప్పుడే అలా వెళ్ళొస్తాం. మీరురాసి పెట్టండి. ఇప్పుడే వచ్చేస్తాం" అని చెప్తే పంతులు "కాఫీ" తాగిరండి బాబు" అని వెకిలిగా నవ్వుతూంటే గొల్లాడికేసి చూస్తూ బయలు దేరారు. నేను కాలుస్తూన్న చుట్ట ఆర్పేసి వాళ్ళ వెనక వెళ్ళాను నా పెట్టి పక్కవాడి కప్పగించి. ఇద్దరు పక్కనే కోర్టులో ఉన్న పోలీసుస్టేషనులోకి వెళ్ళారు. నేను కిటికీ దగ్గర నించున్నా. ఇద్దరు నమస్కారం చేసారు. ఇనస్పెక్టరు "ఏవిటోయ్ ఏమిటి సంగతులు ! డబుల్స్ దొరికిపోయారా ఏమిటి? కోర్టు కొచ్చారు" అన్నాడు నవ్వుతూ. లేదండీ మీతో పని పడింది అన్నాడు కల్లూరి సూరమ్మగారి మనవడు. "నాతోనా? మీకా? ఏమిటోయ్ అది? ఆసక్తిగా టేబుల్ మీదకి వంగి అడిగాడాయన. నాకు స్పష్టంగా మాటలు వినిపిస్తున్నాయ్ కిటికీలోంచి.

"దస్తావేజులు రాసే వెంకన్నున్నాడు చూడండి ఆయన ఓ గొల్లాడ్ని పదిహేను రూపాయల లంచం ఇమ్మని ప్రాణం తీస్తున్నాడు. వాడికి కోర్టు ఖర్చులు యిప్పించింది. అవెంతో వాడికీ తెలీదు కాని ట్రెజరీ ఆయన 56రూ॥ అని చెప్పాట్ట. వాడు తన సంచిలో ఆర్రూపాయలు, 56రూ॥లలో ఆర్రూపాయలు తీస్కోమన్నా వినకుండా వాడిని కసుర్తున్నాడు



హైదరాబాదు కళాసుబ్బారావు కళావేదికలో మానస ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయ గానసభల ఆధ్వర్యంలో జరిగిన సభలో 'లైఫ్ టానిక్' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డా॥పోరంకి దక్షిణామూర్తి. చిత్రంలో రఘుశ్రీ, చాట్ల శ్రీరాములు, గ్రంథకర్త డా॥ దేవరాజు మహారాజు, ఆదివిష్ణు దీక్షితులు, కె.పి. అశోక్‌కుమార్‌లు ఉన్నారు.

పంతులు. మీరు కాస్త ఆయనికి బుద్ధి చెప్పాలి" రెండు చింతలవాడు విడమర్చి చెప్పాడు.

ఇన్‌స్పెక్టరు నవ్వుతూ "ఇవి రోజూ మామూలే బాబూ ఎంతకూ వాళ్ళని బెదిరించ టం? ఆయనికి అసలు బుద్ధిలేదు వట్టి డబ్బు మనిషి సరే పదండి; ఓసారి బెదిరిస్తే గాని దారికి రాడు. ఓయ్ 104 కొంచెం మంచినీళ్ళు తీసుకురా" అని బెల్ట్ పెట్టుకొని హేట్ పెట్టుకొని మంచినీళ్ళు తాగి బయలుదేరాడు. నేనూ ఆనందంగా అనుసరించాను. ఈమధ్య వెంకన్న ఆగడం పెచ్చు మీరిపోయింది మా గుమస్తా లందరం అసహ్యించుకున్నా ప్రయోజనం లేకపోయినందుకు అనుకోని ఈ సంఘటనకు నాకు చాలా సంతోషం వేసింది.

దారిలో రెండుచింతల వాళ్ళబ్బాయి చెప్తున్నాడు "నాన్నగారు అడిగితే యివ్వమని అయిదురూపాయి లిచ్చారండి. అతను రెండ్రూ పాయలే అడి గాడు అది కూడా ఇప్పుడు ఇవ్వాలనిపించటం లేదు. అయినా ఇయ్యలేని వాళ్ళనంత రొక్కించడం ఏం బాగులేదండి"

"ఇంకా కాలేజీలో చదువు కుంటున్నారు కదా ! అలాగే అనిపిస్తుంది. బయటకొచ్చాక ఇలాంటివి నెమ్మది నెమ్మదిగా తెలుస్తుంటాయి. అయినా ఆయనంటే అందరికీ అసహ్యమే. అడ్డమైన యాగీ చేస్తాడు. అసలు గుట్టుచప్పుడుగా చేసే పనది కానీ అల్లరి చేసుకుంటాడు. పక్క వాళ్ళని చూసేనా బుద్ధి తెచ్చుకోడు. పైగా వాళ్ళందరూ వెధవలంటాడు ఈ సారి స్ట్రాంగ్ డోసు ఇస్తాన్లే పిల్లలు గలాడు ఉద్యోగం ఊడితే ఇల్లు గడవదని ఆలోచిస్తుంటే రోజు రోజుకి పేట్రేగి పోతున్నాడు" ఇన్‌స్పెక్టరు చాలా నెమ్మదిగా మాట్లాడుతున్నా విసుగు ఖచ్చితంగా తెలుస్తోంది.

గదిలోకి ముందుగా మీరు వెళ్ళం డన్నట్టు సంజ్ఞ చేసి, తాను బయట నిలుచుని సిగరెట్టు వెలిగించుకుందామని సిగరెట్ పాకెట్ తీసాడు. నేను పలక రింపుగా నవ్వి అగ్గిపెట్టె ఇచ్చాను. గొల్ల వెంకడు ఇంకా అక్కడ వేలాడు తున్నాడు. వెంకన్న పంతులు కుర్రాళ్ళిద్దరికి అతి వినయంగా కాయితాలిచ్చేసి వెకిలిగా నవ్వుతూ అంటున్నాడు. "కాఫీకి అలా నన్ను పిలిస్తే రానాబాబూ ! ఆ తీస్కోండి, అన్నట్టు నాన్నగారేం చెప్పలేదా నీకు" అని. కళ్ళజోడుకి ముక్కుకి మధ్యలోంచి వికారంగా చూసాడు.

"నాకేం తెలీదు కానీ వీడి సంగ తేంటి?" అన్నాడు రెండుచింతలవాడు "వెధవ కోర్టు ఖర్చులు తీసుకుంటూ మాది మాకు ముట్టచెప్పమంటే గింజుకుంటున్నాడు. మీ కెందుకులే గానీ సాయంత్రం నాన్నగారి దర్శనం చేసుకుంటానని చెప్పండి" అని కాయితాలు సర్దుతున్నాడు పంతులు. సహనం నశించిన గొల్లవాడు "పంతులుగోరు ! ఆఖరికి నా కాయితం నాకిత్తరా నేదా ? నా కాడయితే ఆర్రూపాయలున్నాయి మిగతా యారు అందులో యట్టుకోనేదంటే నీ సంగతి టెజరీ బాబుతో సెప్పుకుంటానన్నాడు. గయ్‌మని లేచాడు వాడి మీదకి పంతులు "నీ బాబుతో చెప్పుకో నాకేం భయం డబ్బులిక్కడ పెడితేనే కాయితం కదిలేది వెళ్ళు వెళ్ళు" అన్నాడు.

ఇన్‌స్పెక్టరు లోపలికి వస్తూ "వాడి బాబెందుకు లెండి. చచ్చి ఏ స్వర్గా నున్నాడో నేను చాలు. డబ్బులెంత యివ్వాలంటారు? అన్నాడు అలవాటైన చిరునవ్వుతో.

బిక్కచచ్చి పోయాడు పంతులు "ఆఁ ఏంలేదులెండి వీడు నానుస్తున్నాడు కాని ఈ పాటికి పనైపోయేదె దొంగ వేషాలన్నీ వెధవ్వి. మనకు ఇవి మామూలే కదా !" అన్నాడు మనం మనం ఒకటన్నట్లు "అలాగా సరే ఎంతున్నాయి నీ దగ్గర అనడిగాడు ఇన్‌స్పెక్టరు "అద్గదీ దారి బాబయా ! ఆర్రూపాయలున్నాయి నా కాడ కడమాయారూ అందులో కట్టుకోమనండి అలగ తగూ తెగిపోవాల" అన్నాడు గొల్ల వెంకడు హుషారుగా.

"ఏమంటారు?" అన్నట్లు చూచాడు పంతుల్ని ఇన్‌స్పెక్టరు. కానీ అతని బింకం సడలలేదు తల అడ్డంగా ఊపాడు. వెంటనే ఇన్‌స్పెక్టరు నోట్‌బుక్ తీసి పెన్ కేప్ తీసి "ఆఁ నీ పేరు చెప్పరా? ఎంత ఇమ్మన్నాడు పంతులు? నువెంత ఇస్తానన్నావు? ఎందుకిమ్మ న్నాడు? రశీదిస్తానన్నాడా? సాక్ష్యం ఎవరు? మీరు" అంటూ నన్ను చూసి అర్థోక్తిలో ఆగాడు.

వెంకన్నపంతులికి ఠారెత్తింది. "ఇదేమి టండీ వాడిని అడుగుతున్నారు? నా మాట వినరా?" అన్నాడు గాభరాగా. ఇన్‌స్పెక్టరు అసలతని సంగతి పట్టించు కోకుండా జవానుని" బాబు ఓ ఇద్దరు కానిస్టేబుల్స్‌ని పిలు" అన్నాడు. పంతులికి నషాళానికెక్కిపోయింది.

"అయ్యా! మీరు దయ చూడాలి. పిల్లలు గలవాడిని. ఈరోజుకి నేనే దొరికానా? అయినా ఇన్నాళ్ళు వక్కవక్కన వనిచేన్తూ అలా మొహామొహాలు చూసు కోవాల్సిన వాళ్ళం. ఇదేం భావ్యంగా లేదు. ఏదో బతుకు తెరువు నాలుగు రాళ్ళు సంపాదిచుకుంటున్న వాడిని ఇలా బజారున పడెయ్యడం మీకు న్యాయమా? మీకు మేము మాకు మీరు సాయం గాని వరాయి వాళ్ళెవరొస్తారండి? వీడికి నేను కాయితం ఇస్తాగాని, ఆవివరాలు చింపె య్యండి "బ్రతిమాలుతున్నట్టు, మొహమాట పెడుతున్నట్టు, లొంగిపోయినట్టు తెలివిగా మాట్లాడుతున్నాడు పంతులు.

ఇన్‌స్పెక్టరిదేం పట్టించుకోలేదు "మీ పేరు? ఉద్యోగం పేరు? ఎన్నాళ్ళ సర్వీసు! ఫస్ట్ ఎపాయింట్‌మెంట్ ఎక్కడ? సర్వీసు రిజిష్ట రుందా? ఇలా నానిస్తే లాభం లేదు వేగం చెప్పండి" అని అడుగుతున్నాడు.

పంతులు లేచి సర్దుకున్నాడు "అయ్యా! ఇవి చేతులు కావు మీరే కాపాడాలి. ఇంత పెందరాళే నా మీద దండయాత్ర ప్రారంభిస్తే నేనేం చెయ్యగలను పిల్లలు గలవాడ్ని కనిక రించాలి" ఇన్‌స్పెక్టరు చేతులు పట్టేసుకున్నాడు.

ఆయన వదిలించుకుంటూ "ఇప్పుడు నేను కేసు బుక్ చేస్తే ఉద్యోగం పోతుంది. పెన్షన్ రాదు. దానివల్ల నాకేమిటి లాభం? ఏ పని చేసినా పుణ్యం పురుషార్థం ఉండాలి. ఎవరి బ్రతుకు తెరువు వాళ్ళది. ఏవంటారు? నేను వేలకి తగ్గను. అయినా ఇది మీ జీవిత సమస్య. ఆలోచించుకోండి, అసలు ముందు నేనడిగినది చెప్పండి ఏవంటారు? ఏవన్నా పలుకుతారా?" యధాలావంగా చిరునవ్వుతో అన్నాడు. పంతులు మొఖంలో నెత్తురుచుక్క లేదు. నాకేదో వెనక ముందులుగా గుర్తొచ్చింది పుచ్చుకొంటి వాయనం....... ఇస్తినమ్మ వాయనం.